ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



వర్షాలకు పెదకాకానిలో నీట మునిగిన వరిపైరు (ఫైల్)

వాస్తవ సాగుదార్లకు మొండిచేయి

- ఇష్టారాజ్యంగా పంట నష్టం అంచనాలు
- రాజకీయ సిఫార్సుల మేరకు నమోదు
- క్షేత్రస్థాయి సిబ్బంది తప్పిదాలు, పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇటీవల సంభవించిన అతి భారీ వర్షాలతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ముంపునకు గురైన పంటలలో నష్టపోయిన కొంతమంది రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. వాస్తవ సాగుదార్లను గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించినా క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోలేదు. సచివాలయాల పరిధిలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, విఆర్‌వోలు కలిసి స్థానిక టిడిపి నాయకులు చెప్పిన వారి పేర్లు నమోదు చేసి మిగతా వారి పేర్లు పక్కన పెట్టారన్న విమర్శలున్నాయి. నష్టం అంచనాలను తగ్గించాలని ఉన్నతాధికారుల నుంచి వత్తిడి ఫలితంగా కొంత మంది రైతులను సచివాలయాల సిబ్బంది విస్మరించారనే విమర్శలు కూడా వచ్చాయి.

గుంటూరు జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు నష్టం అంచనాలను అధికారులు భారీగా తగ్గించారు. ఈనెల 12న కేంద్ర బృందం జిల్లాకు వచ్చేనాటికి జిల్లాలో 83 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని నివేదించారు. తరువాత కొద్ది రోజులకే 41,432 ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. ఈమేరకు జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. నష్టం అంచనాలు సగానికి సగం తగ్గించడానికి 33 శాతానికి మించి పంట నష్టం తక్కువగానే జరిగిందని జిల్లా అధికారులు చెప్పుకొచ్చారు. 24,212 మంది రైతులకు ▶ 2లో



నివాళులర్పిస్తున్న నాయకులు

సామాన్యులకు సంపద కోసం పోరాడిన సీతారాం

- ప్రజల తరుపున పాలక పక్షాలను నిత్యం ప్రశ్నించిన ఏచూరి
- సంస్మరణ సభలో వక్తలు - వివిధ పార్టీలు, సంఘాల నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దేశంలో సంపద సృష్టించడం ఒకెత్తయితే దాన్ని సామాన్య ప్రజలకు చేర్చకుంటే ప్రయోజనం ఏమిటని ప్రభుత్వాలను సీతారాం ఏచూరి ప్రశ్నించే వారని, ఆర్థిక దుష్ఫలితాలపై నిత్యం తన గళాన్ని వినిపించిన ఆయన మరణం తీరని లోటని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. సభకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా తొలుత సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ ప్రసంగించారు. అనంతరం కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరిని సష్టించిందని గొప్ప రాజనీతజ్ఞుడని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. మతతత్వాన్ని వ్యతిరేకించడం, లౌకికవాదం కోసం పోరాటంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఇటీవల ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని కట్టడి చేయడానికి ఏర్పాటైన ఇండియా బ్లాక్ ఏర్పాటులో సీతారాం ముఖ్యభూమిక పోషించారని చెప్పారు. మోడీ పాలనలో రాజ్యాంగం, ఫెడరలిజం, ప్రజాస్వామ్యం, లౌకిక విధానాలు ప్రమాదంలో పడ్డాయన్నారు. జమిలి ఎన్నికలు దేశ సమైక్య విధానాలకు ప్రమాదమని ఏచూరి ప్రచారం చేశారని గుర్తు చేశారు. బిజెపి విధానాలతో దేశానికి వస్తున్న పెను ప్రమాదాలను తిప్పికొట్టాల్సిన సమయంలో సీతారాం ఏచూరి మరణం బాధాకరమన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఏచూరిది చెరగని ముద్రన్నారు. అన్ని పార్టీల నాయకులను రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వకంగా పలకరించే ఏచూరి లాంటి నాయకుడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. దృఢమైన విప్లవాత్మక నిబద్ధత, నిశితమైన వ్యూహాత్మక అంతర్ దృష్టితో ▶ 2లో



ఎమ్మెల్యేలతో కేంద్రమంత్రి చంద్రశేఖర్ భేటి

ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ - టిడిపి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

టిడిపి ఎమ్మెల్యేలతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం తన నివాసంలో సమావేశమయ్యారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరగనున్న ఎన్నికల్లో టిడిపి నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేయడంపై ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలు సేకరించి గెలుపు అవకాశాలపై చర్చించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పట్టభద్రుల ఓటర్ల చేర్పులపైనా సమాలోచనలు చేశారు. మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ మినహా మిగతా ▶ 2లో

వరద నష్టాలపై ప్రత్యేక గ్రీవెన్స్ కౌంటర్లు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

వరద నష్టాలకు సంబంధించిన ఫిర్యాదులకు గుంటూరు కలెక్టరేట్, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం, గుంటూరు ఆర్‌డిఒ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో సెప్టెంబర్ 30వ తేదీ నుండి అక్టోబర్ 4వ తేదీ వరకూ ప్రత్యేక ఫిర్యాదుల కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివానం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన వారికి ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం కోసం సిఫార్సు చేశామని, ప్రభుత్వం నష్ట పరిహారం ఈనెల 25 నుండి బాధితుల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తోందని పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా నష్టపరిహారం అందకపోయినా, ఎన్యుమరేషన్‌పై సందేహాలున్నా, ఫిర్యాదులున్నా ప్రత్యేక ఫిర్యాదుల కౌంటర్లలో ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ సూచించారు.



మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రక్త పరీక్షలు కోసం నిరీక్షిస్తున్న జ్వర పీడితులు

పీడిస్తున్న విష జ్వరాలు

ప్రజాశక్తి- మాచర్ల

ఇటీవలన ఃవర్షాలు, వాతవరణ మార్పులతో మాచర్ల పట్టణం, గ్రామీణ జనాలు విష జ్వరాల బారిన పడుతున్నాడు. గత 20 రోజుల నుండి విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. పట్టణంలోని అస్పత్రుల నిండా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రావటం సహజమే అయినా ఈ సారి రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. వైద్యులు కూడా జ్వరానబారిన పడ్డారు. పట్టణంలోని మూడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పూర్తిస్థాయి వైద్యులు లేరు. దాంతో పట్టణంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిపై భారం పడుతోంది. పని భారం పెరటంతో రక్త పరీక్షలు, తదితర పరీక్షల రిపోర్టులు ఆలస్యమవుతున్న కారణంగా రోగులు పలు ప్రైవేటు ▶ 2లో

వాస్తవ సాగుదార్లకు మొండిచేయి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన 41,432 ఎకరాల్లోనే వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.10 వేలు చొప్పున రూ.41.06 కోట్ల సాయం అవసరం అవుతుందని అంచనా వేశారు. జిల్లాలో అత్యధిక వర్షం కురిసి పంటలు పూర్తిగా నీట మునిగి, కొన్ని పంటలు ఉరకెత్తిపోయిన దుగ్గిరాల మండలంలో కేవలం 2592 ఎకరాల్లోనే నష్టం జరిగిందని తేల్చారు. భారీగా ముంపునకు గురైన కొల్లిపరలో 1962 ఎకరాలలో నష్టం జరిగిందని చూపగా రాజకీయ వత్తిడి నేపథ్యంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో తెనాలి మండలంలో మాత్రం అత్యధికంగా 6636 ఎకరాలు నష్టం జరిగిందని నిర్ధారించారు. పొన్నూరులో 7983, పెదకాకానిలో 7186 ఎకరాలు, చేబ్రోలులో 3524 ఎకరాల నష్టం చూపారు. మిగతా మండలాల్లో చాలా తక్కువ విస్తీర్ణంలోనే నష్టం అంచనాలు వేశారు. గత నెల 31 నుంచి ఈనెల 12 వరకు పొలాల్లో నీరు కదలకుండా ఉండటం, తిరిగి మళ్లీ వర్షాలు పడటం వల్ల పలు గ్రామాల్లో పంటలు ఎందుకు పనికిరాకుండా పోయాయి. 10 రోజుల పాటు నీటిలోనే ఉండిపోవడంతో పూర్తి స్థాయిలో దెబ్బతిన్నట్టేనని చెప్పిన అధికారులు ఆ తరువాత వాస్తవ అంచనాల్లో అంకెలు మార్చేశారు.

ప్రభుత్వం నుంచి వత్తిడితో నష్టం అంచనాల్లో మార్పులు జరిగినట్టు తెలుస్తోంది. ఉద్యాన పంటలు తొలుత 9 వేల ఎకరాల్లో జరిగినట్టు నిర్ధారించగా 2815 ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు తేల్చారు. నష్టపోయిన రైతులకు కేవలం ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయిచింది. ఇప్పటికీ చాలా మంది రైతుల ఖాతాల్లో నష్టపరిహారం సొమ్ము పడలేదు. అలాగే పల్నాడు జిల్లాలో పెదకూరపాడు, గురజాల నియోజవకవర్గాలోని దాదాపు ఆరు మండలాల్లో భారీ నష్టం జరిగినా కొంత మంది రైతులకు పరిహారం వచ్చినట్టు తెలిసింది. చాలా మందికి తమకు పరిహారం జమకాలేదని చెబుతున్నారు. అమరావతి, క్రోసూరు, దాచేపల్లి, అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు, మాచవరం, మండలాల్లో ముంపు సమస్య ఎక్కువగా ఉంది. కొంత మంది ఇకెవైసి చేయలేదని చెబుతున్నారు. కౌలు రైతులకు ఇకెవైసి చేయకపోవడం వల్ల వారికి పరిహారం రాలేదు.

పీడిస్తున్న విష జ్వరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రులకు వెళ్తున్నారు. అధిక వర్షాలు, పారిశుద్ధ్య లోపం, కలుషిత నీరు తాగడం, దోమకాటు ఇలా పలు కారణాలతో వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. జ్వర బాధితుల్లో అధికంగా చిన్నారులు ఉంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటిల్లి పాదీ జ్వరాల బారినపడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు, చికిత్సలు, మందులకు వేలల్లో ఖర్చు అవుతోందని రోగులు వాపోతున్నారు. జ్వరన బారిన పడి చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. వెల్దుర్తి మండలం మండాదిలో ఈ మధ్యకాలంలోనే ఒక మహిళ జ్వరంతో మృతి చెందారు.

విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ ఉదయభాను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

విషజ్వరాలు అధికంగా నమోదవుతున్నాయి. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు. దోమలు కట్టుకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే తినాలి. శుభ్రమైన నీటినే తాగాలి. వైరల్ జ్వరాలకు ప్రత్యేక చికిత్స ఏమీ ఉండదు. టైఫాయిడ్, మలేరియాలకు యాంటీబయోటిక్ మందులు నాలుగైదు రోజుల కోర్సును తప్పక తీసుకోవాలి. జ్వరం వస్తే విశ్రాంతి తప్పక తీసుకోవాలి.

'ఎమ్మెల్యే రామాంజనేయులు క్షమాపణలు చెప్పాలి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తనకు ఓటేయని ఎస్సీలకు సంక్షేమ పథకాలు రావని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు పెదగొట్టిపాడులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో మాట్లాడ్డం సిగ్గుచేటని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ విమర్శించారు. ఎస్సీలు ఓట్లు వేయకపోతే ఎమ్మెల్యే రామాంజనేయులు గెలుపు సాధ్యమా? అని ప్రశ్నించారు. ఎస్సీలకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

గుండె పదిలంగా ఉండాలని 5కె, 2కె వాక్‌లు



ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

అత్యవసర, ప్రాణాపాయ పరిస్థితుల్లో సిపిఆర్ ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుందని, వ్యక్తి ఆక్సిజన్ తీసుకోలేనప్పుడు గుండెకు ఆక్సిజన్ పంపింగ్ చేసేందుకు సిపిఆర్ దోహదం చేస్తుందని నరసరావుపేట మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 5కె వాక్‌కు విశేష స్పందన లభించింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం నుండి బైపాస్ రోడ్డు, పల్నాడు రోడ్డు, మల్లమ్మ సెంటర్ మీదుగా వాక్ నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి రూ.500 విలువైన టి షర్ట్, టోపి బహుమతిగా అందజేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి తమ హాస్పిటల్ గుండె పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. లక్కీ డ్రా ద్వారా నలుగురికి సైకిళ్లు బహుమతిగా అందజేస్తామని డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.



వాక్‌లో ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కాలేజీ విద్యార్థులు

5కె వాక్‌లో నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలోని ఎఎం.రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు మాట్లాడుతూ మానసిక స్థిరత్వం ఉంటే గుండె ఆరోగ్య స్థిరత్వం కూడా ఉంటుందన్నారు. కాలుష్యాల మధ్య మనిషి జీవనం కొనసాగించడం కారణంగా తరచూ గుండె సంబంధిత వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని, పని ఒత్తిడితో గుండె సంబంధిత వ్యాధులు రావచ్చని అన్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం కూడా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫార్మసీ ప్రాక్టీస్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్, ఎస్ఎస్ఎస్ విభాగాధిపతి డాక్టర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - వినుకొండ

శ్రీ దత్త హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి ఉదయం 7 గంటలకు ప్రముఖ గుండె వైద్యులు గార్లపాటి కృష్ణకాంత్ సారథ్యంలో 2కె వాక్ నిర్వహించారు. పట్టణంలోని వైద్యులు, ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం వద్ద నుండి ప్రారంభమైన వాక్ స్తూపం సెంటర్, ఏనుగుపాలెం రోడ్డు మీదుగా శ్రీ దత్త హాస్పిటల్ వరకూ కొనసాగింది. గుండె పనితీరు, సమస్యలు, నివారణ చర్యలపై డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి వివరించారు. డాక్టర్లు పూర్ణిమ, అన్న మణికంఠ సురేష్, ఎల్ఎన్ రావు, ఆనంద్ కుమార్, ప్రసన్న పాల్గొన్నారు.

సామాన్యులకు సంపద కోసం పోరాడిన సీతారాం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు, సభికులు

(మొదటి పేజీ తరువాయి)

చెరగని ముద్ర వేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, ఎఐటియుసి పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతుల సమస్యలపై ప్రభుత్వాలను సీతారాం నిలదీశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించి, ప్రజా ప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. వామపక్ష పార్టీలు బలపడడానికి ఉపయుక్తమైన విధానాలను కొనసాగించారని అన్నారు. ఆయన మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న వామపక్ష పార్టీలకు తీరని లోటన్నారు. ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి రెడ్ బాషా మాట్లాడుతూ పార్లమెంట్లో ప్రజా సమస్యలు ప్రస్తావించి, దేశంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు ప్రస్తావించటంలో ప్రముఖ పాత్రను సీతారాం పోషించారని గుర్తు చేశారు. ఆయన సూచనలు పాలక, ప్రతిపక్షాలకు దిక్సూచిగా నిలిచియాన్నారు. ఆయన చూపిన బాటలో ప్రజా పోరాటాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ సిద్ధాంతాలకు కట్టుబడి పని



చేసిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఇతర నాయకులు మాట్లాడుతూ దేశానికి దిశానిర్దేశం చేసే అనేక చట్టాల రూపకల్పనలో సీతారాం ఏచూరి పాత్ర ఎనలేనిదని గుర్తు చేసుకున్నారు. భారతదేశ వామపక్ష ఉద్యమంలో ఓ అరుణతార రాలిందని, ఓ సిద్ధాంతకర్త, ఓ దార్శనికుణ్ణి దేశం కోల్పోయిందని, ఆయన ఆశయాలను కొనసాగింపు ఆయనకిచ్చే నివాళి అని ఉద్ఘాటించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎం.రవిబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్, పట్టణ కార్యదర్శి షేక్.సిలార్ మసూద్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నాయకులు డి.శివకుమారి, కె.హనుమంత్‌రెడ్డి, మహేష్, జి.మల్లేశ్వరి, టి.పెద్దిరాజు, విమల, బాలకృష్ణ, పి.మహేష్, ఎవికె దుర్గారావు కె.రామారావు, కె.కోటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఉదయశ్రీ, కె.లక్ష్మి, నాగమ్మబాయ్, యు.రంగయ్య, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత తోకల కోటేశ్వరరావు సీతారాం ఏచూరి పై రచించి ఆలపించిన గీతం ఎంతగానో ఆకట్టుకుంది. ప్రజానాట్యమండలి కళాకారులు ఏచూరి జీవిత చరిత్రను పాటల రూపంలో ప్రదర్శించారు.

ఎమ్మెల్యేలతో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ భేటి

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలంతా ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాలేదు. ఆయన గతంలో ప్రాతినిధ్యం వహించిన తెనాలి స్థానాన్ని పొత్తులో జనసేనకు కేటాయించారు. అసంతృప్తికి గురైనా ఆయనకు భవిష్యత్తులో తగిన స్థానం కల్పిస్తామని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు ఆదివారం నిర్వహించారు. 200 మందికిపైగా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. పోటీలను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించగా ఎమ్మెల్సీ కె.ఎస్ లక్షణరావు మాట్లాడుతూ సామాజిక సేవాభావంలో యుటిఎఫ్ ఘన కీర్తి కలిగి ఉందని చెప్పారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతినిత్యం సమాజంలో ఉపాధ్యాయుల గౌరవం పెంచే స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వినూత్న సంస్కరణలు తెచ్చేందుకు విద్యా సదస్సుల ద్వారా చర్చించి సమగ్ర నివేదికలు ప్రభుత్వానికి యుటిఎఫ్ సమర్పిస్తోందన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను సక్రమంగా నడపాలని తాపత్రయపడే ఎంతోమంది నాయకులు కలిగిన యుటిఎఫ్ సమాజంలో అత్యంత బాధ్యతాయుత పాత్ర పోషిస్తోందన్నారు. ఇదిలా ఉండగా జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు వచ్చే నెల 4, 5 6 తేదీల్లో గుంటూరు ఎన్.టి.ఆర్ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని చెప్పారు. ఇటీవల పోటీల్లో విజేత లకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు బహుముతుల ప్రదానం చేశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

జిజిహెచ్‌లో హిమోఫీలియా కేర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి (జిజిహెచ్)లో హిమోఫోలియా కేంద్రాన్ని ఆదివారం స్థానిక శాసనసభ్యుడు మహమ్మద్ నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి పేద రోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. హిమోఫోలియా కేంద్రాన్ని అందుబాటులో తీసుకుని రావడం వల్ల వ్యాధి గ్రస్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1100 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారని వారాందరికి సంపూర్ణ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఆయన చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంతర్గత రక్త స్రావంతో బాధ వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేత్రుత్వం లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం టి కష్ణబాబు, డి యం ఈ నరసింహం, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ల సహకారం తో ఈ సెంటర్ ను ప్రారంభించామని ఆయన చెప్పారు. హిమోఫిలియా సొసైటీ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధికి ఖరీదైన చికిత్స

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో గత మాసంలో పేషంట్ జి.నాగదుర్గ అరుదైనవ్యాధి తో చేరారు. ఎక్కడైనా దెబ్బ తగిలిన, ఆపరేషన్ చేసిన సమయం లో రక్త శ్రావం ఎక్కువగా అవుతుంది. ల్యాప్రోస్కోపి లో కుడి వైపు అండాశయం లో ఏర్పడిన టిష్యూను తొలగించారు. రక్త శ్రావం తగ్గించేందుకు 319 ఇంజక్షన్లు చేశారు. దాదాపు కోటిన్నర వ్యయం తో పేషంట్ కు స్వాంతన చేకూర్చారు. ఈ ఆపరేషన్ చేసేందుకు స్వయంగా జనరల్ సర్జరీ హెచ్ ఓ డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ రంగంలో దిగి ఆపరేషన్ సక్సెస్ చేసారు. ఈ ఆపరేషన్ లో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు సంతోష్, లిఖిత మత్తు వైద్యులు డాక్టర్ పోలయ్య, జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు శైలజ, ఫార్మసి విభాగం అధికారి డాక్టర్ సుధాకర్ రెడ్డి, బ్లడ్ బాంక్ అధికారి డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

నేడు వర్సిటీకి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు నేడు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంకు రానున్నారు. తత్వవేత్త కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాల సందర్భంగా లిపద్మవిభూషన్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి యొక్క విజన్ అండ్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియాలి అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ను ప్రారంభించనున్నారు. ఉదయం 10.30 గంటలకు వర్సిటీలోని డైక్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉపకుల పతి ఆచార్య కే. గంగాధరరావు అధ్యక్షత వహించనున్నారు. సదస్సుకు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సివిల్ సప్లైస్ శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, యూపిఎస్సి పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం హాజరవుతారని అన్నారు. ఈ సదస్సులో ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అశోక్ వోహ్రా కీలకోపన్యాసం చేయనున్నారు. సదస్సుకు గౌరవ అతిధులుగా రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు హాజరవుతారు.

ఏర్పాట్లు పూర్తి : జాతీయ సదస్సు నిర్వహణకు వర్సిటీ ముస్తాబయింది. వర్సిటీ అధికారులు వర్సిటీ ముస్తాబు చేసి సర్వం సిద్ధం చేశారు . ప్రధాన వేదికపై అతిథుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. అతిథిల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. సదస్సును విజయవంతం చేసేందుకు ఉపకులపతి ఆచార్య గంగాధరరావు ఎనిమిది కమిటీలను నియమించారు. ఆదివారం వర్సిటీ లోని ఆడిటోరియాన్ని వీసి గంగాధర్ రావు, రిజిస్ట్రార్ సింహాచలం, సదస్సు కన్వీనర్ త్రిమూర్తి రావు, కమిటీ కన్వీనర్లు, ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి కోరారు. ఆదివారం ఆయన ఉండవల్లిలో మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సోమవారం ఉదయం పది గంటలకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి కార్మికులు, ఉద్యోగుల మహా ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన, ధర్నాలలో నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఎం రవి




ఉపకరణాలు అందచేస్తున్న సాంబశివరావు, సంఘం నాయకులు

బాల, బాలికలకు విద్యా ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

విద్య ద్వారానే రజక వృత్తిదారుల జీవితాల్లో మార్పులు వస్తాయని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య అన్నారు. నిడుబ్రోలు సాంబశివరావు కన్వీనర్‌గా గుంటూరు జిల్లా 'రజక బాల బాలికల విద్య ప్రోత్సాహ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఆదివారం పాతగుంటూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రజక బాల బాలికల విద్యా ప్రోత్సాహ వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ గత 13 సంవత్సరాలు నుండి క్రమం తప్పకుండా రిటైర్డ్ ట్రెజరీ అధికారి సాంబశివరావు బాలబాలికలకు అవసరమైన స్కూలు బ్యాగులు, దుప్పట్లు, వస్త్రాలు, పెన్నులు పుస్తకాలు అందిస్తూ విద్యా ప్రోత్సాహం చేయటం అభినందనీయం అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ హాస్టల్స్ వెల్ఫేర్ అధికారి సుచిత్రాదేవి, రిటైర్డ్ తాసిల్దారు శంకర్రావు, వెంకటేశ్వర, న్యాయవాది కొండపల్లి శ్రీనివాస్, న్యాయవాది నాగేశ్వరావు, ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, గౌరవాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందిస్తున్న మానవతా బృందం

స్వచ్ఛంద సేవకులకు అభినందన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని సంస్థ కార్యాలయంలో ఆదివారం అభినందించింది. ఇటీవల సంభవించిన వరదల సందర్భంగా ఆ ప్రాంతాలలో పర్యటించి బాధితుల పక్షాన నిలిచిన పలువురిని సంస్థ తరపున ప్రశంసా పత్రంతో అభినందించింది. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ ఛైర్మన్ కొత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ సామాజిక సేవా దక్పథంతో, సమాజం పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరించేవారు అరుదుగా ఉంటారన్నారు. ముఖ్యంగా ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వీరి సేవలు అనిర్వచనీయమని ప్రశంసించారు. పలువురికి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్, అధ్యక్షులు కటకం వెంకట ప్రసాద్, సభ్యులు డివిఎల్ సోమయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించే పవిత్రోత్సవాలను ఆదివారం ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా ప్రసాద్ శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ప్రధాన అర్చక, అర్చకస్వాములు, వేదపండితుల పర్యవేక్షణలో ప్రారంభించామని, పవిత్రోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ కోరారు. మూడు రోజులు పాటు నిర్వహించే కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమములో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చక పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, ఉపప్రధాన అర్చకులు, అర్చకస్వాములు, వేదపండితులు, దాతలు తెనాలి వాస్తవ్యులు రెడ్డి నవీన్‌కుమార్, విజయలక్ష్మీ, నీలివెల్లి కోటేశ్వరి గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి రూరల్

తెనాలి డివిజన్ జెఎసి ఎస్సి, ఎస్టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఐతానగర్ శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటి హాల్లో ఎస్సి వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువడించిన తీర్పును వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐకమత్యంగా మెలుగుతున్న మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయడం అన్యాయమని మాలమహానాడు జేఏసీ నేతలు సీనియర్ కౌన్సిల్, హైకోర్టు అడ్వకేట్ బి శశిభూషణ్, కారుమంచి రవికుమార్, పంతగాని రమేష్, దాసరి చెన్నకేశవులు, పొందుగల చైతన్య ప్రసంగించారు. కుట్రపూరిత రాజకీయాలతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలను వర్గీకరణ చేస్తే తగిన మూల్యం చెల్లించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో దళితులు ఉద్యమకారులుగా కాకుండా రాజకీయనాయకులుగా ఉద్భవిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తొలుత సభ అధ్యక్షత పిల్లి విద్యాసాగర్, గెడ్డటి వహించిన కార్యక్రమంలో పలు మాల సంఘాల నేతలు, అంబెడ్కర్ వాదులు, సంగసంస్కర్తలు, విద్యావేత్తలు అధిక సంఖ్యలో పాల్గున్నారు. కార్యక్రమంలో బండికల్ల బుల్లయ్య, బొనిగల ప్రదీన్, కంచర్ల కోటేశ్వరరావు, అక్కిదాసు కిరణ్ కుమార్, కనపర్తి అబ్రహాం లింకన్, కారుమంచి సునీల్ సందీప్, గోవతోటి మనోజ్, యండ్రపాటి అశోక్ కుమార్, వేము సమత, కారుమంచి బానుప్రకాశ్, కంచర్ల అజయ్ కుమార్, మధిర నాగేశ్వరరావు తదితరులు పాల్గున్నారు.

ఆళ్లకు ఉత్తమ సాహితీ సేవా పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావు మహానుభావా ఉత్తమ సాహితీ సేవ పురస్కారం అందుకున్నారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. సాహిత్యరంగంలో నాలుగున్నర దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారాన్ని అందించినట్లు ట్రస్ట్ వ్యవస్థపక అధ్యక్షులు డాక్టర్ పూసపాటి బాలాజీ చెప్పినట్లు ఆళ్ళ వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి మధుసూదన్, కవి కష్ణ కౌండిన్య, మున్నంగి నాగిరెడ్డి, కష్ణారెడ్డి, గాయని వరలక్ష్మి, వివిధ సాహితీ, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుండి ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30వ తేదీ నుండి ఓటర్ల నమోదు కార్యక్రమం అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఓటర్ల నమోదుకు అవసరమయ్యే ఫారం-18 అవగాహన సంస్థ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, ఫారం పూర్తి చేయించడం, తగు గైడెన్స్ ఇవ్వటంలో అవగాహన సంస్థ సభ్యులు సహకరిస్తారని తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు అందరూ తిరిగి కొత్తగా నమోదు కావాల్సిందేనని, పాత లిస్టులో ఉన్నా అది చెల్లదని అన్నారు. ఓటర్ల నమోదు అధికారికంగా సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఓటరు నమోదు ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్ ఫోటోస్టాట్, ఆధార్ కార్డు ఫోటోస్టాట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కావాలన్నారు. అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాల కతీతంగా ఎన్నో సంవత్సరాల నుంచి ఓటరు నమోదు కార్య క్రమాన్ని నిర్వహిస్తూ వేలాదిమంది ఓటర్లుగా నమోదయ్యేలా సహకరిస్తున్న అవగాహన సంస్థ ఉచితంగా అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన సంఘటన చిలకలూరిపేట మండల పరిధిలో కావూరు, కోమటినేని వారి పాలెం గ్రామల మధ్య ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గంగన్న పాలెంకి చెందిన పాల వ్యాపారి గుంజి రామారావు (70) చిలకలూరిపేటలో పాలు పోసి తిరిగి వెళుతున్న క్రమంలో నరసరావు పేట నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ఏ.పి.39 ఈ.వై.3545 కారు వేగంగా వస్తూ పాల వ్యాపారి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పాలవ్యాపారి గుంజి రామారావు సంఘటనా స్థలంలో మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి కలగని అందరికి పెళ్లిళ్లు అయిపో యాయని పోలీసులు తెలిపారు. గంగన్న పాలెంలో నిత్యం పాలు పట్టి పట్టణంలో పలువురి ఇళ్లకు వెళ్లి పాలు పోస్తుంటారని తెలిపారు. అతను భౌతిక కాయానికి చిలకలూరిపేట ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. స్వాధీ నం చేసుకున్న కారును పోలీస్ స్టేషన్ వద్ద ఉంచామని కేసు నమోదు చేసి విచారిస్తున్నా మని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

మసీదులో చోరీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల గ్రామంలోని షాబరీన్ మసీదులో పదివేల రూపాయలు చోరీకి గురైనట్లు ఆ మసీదు నిర్వాహకులు సయ్యద్ కరిముల్లా ఆదివారం పెదకూరపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి గిరిబాబు తెలిపారు.

కొడుకు కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు గ్రామానికి చెందిన నల్లపాటి సాగర్ బాబు కనిపించట్లేదని ఆమె తల్లి ప్రభావతి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీరు కరువు.. ఇస్త్రీపెట్టె బరువు..



బొగ్గు, విద్యుత్ ఆధారిత ఇస్త్రీ పనుల్లో వృత్తిదార్లు

- కష్టాల్లో రజకవృత్తిదార్లు
- పెరిగిన ధరలతో సతమతం
- ఆక్రమణల్లో ధోబీ ఘాట్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బట్టకు మురికిని దూరం చేస్తు, ముడతల్లేకుండా మెరిసేలా చేస్తున్నా వారి బతులకు మాత్రం భారంగాను, రోజులు ఎగుడుదిగుడుగానూ సాగుతున్నాయి.. పని చూపించండి.. అని ప్రభుత్వాన్ని అడగకుండా తామే స్వయం ఉపాధి పొందుతున్న రజక వృత్తిదార్లు సదుపాయాల లేమిని ఎదుర్కొంటున్నారు. వృత్తిని కొనసాగించాలంటే నానా అవస్థలు పడ్డంతోపాటు గదుల అద్దె, విద్యుత్ బిల్లులు, ధరల భారాన్నీ మోయాల్సి వస్తోంది. దోభీఘాట్‌లు లేవు.. ఇస్త్రి పెట్టెల ధరలు పెరిగాయి.. వాటిని వాడేందుకు ఉపయోగించే విద్యుత్, గ్యాస్ ధరలూ పెరగడం ఒకెత్తయితే బట్టలు ఉతకడానికి కనీస నీటి సదుపాయమూ లేక ఇబ్బందులు పడుతున్నారు.

బట్టలు ఉతకడానికి ఇక్కట్లు

పట్టణంలో ఆరు వేలకు పైగా రజక సామాజిక తరగతికి చెందిన వారుంటారని అంచనా కాగా వీరిలో సుమారు 2 వేల మంది వరకూ బట్టలుతకడం, ఇస్త్రీ చేయండం వంటి వృత్తిపరమైన పనులే ఆధారంగా జీవిస్తున్నారు. పట్టణానికి సమీపంలోని ఓగేరు వాగుపై ఆధారపడి అనేక రజకవృత్తిదారుల కుటుంబాలు గడుస్తున్నాయి. ఈ వాగులో బట్టలుతకడం ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందగా ఇప్పుడు దినదిన గండంగా గడుపుతున్నారు. కొంతమంది వృత్తిని మానుకుని ఇతర పనులు చూసుకుంటున్నారు. ఓగేరు వాగు వద్ద గతంలో ధోబీఘాట్ ఉండగా వరదల కారణంగా అవి కొట్టుకుపోయాయి. అయితే పాలకులు వాటిని పునరుద్ధరించకపోవడంతో వృత్తిదార్లు తమ పని చేసుకోవడం కత్తిమీద సాములా మారింది. వాగులో డ్రెయినేజీ నీరు కలుస్తుండగా వాటిని కాకుండా వర్షపు నీరు, ఇతర పారుదల నీరు ఆధారంగా దుస్తులు ఉతకడానికి కొద్దిపాటి నీటి వనరులే ఉండడంతో నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు గతంలో దోభీఘాట్ ఉన్న గడియార స్తంభం ప్రదేశంలో ఇప్పుడు చిన్నచిన్న హోటళ్లు వెలిశాయి. దీంతో వాగు వడ్డున ఉన్న ఇళ్లను రూ.3-5 వేలకు అద్దెకు తీసుకుని అక్కడే పనులు పూర్తి చేసుకుని సాయంత్రం ఇళ్లకు వెళ్తున్నారు. ఉతికి ఇస్త్రి చేసినందుకు జతకు రూ.60-70 వస్తుందని, అద్దెలు, రాకపోకలకు ఖర్చులు పోనూ మిగిలేది స్వల్పమేనని చెబుతున్నారు. దోభీఘాట్లు నిర్మించాలని, ఆస్పత్రులు ఇతర అవసరమున్న ప్రభుత్వ సంస్థలోల దుస్తులు ఉతికే ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నారు.

బరువైన ఇస్త్రీపెట్టె..

ఇదిలా ఉండగా దుస్తుల ఇస్త్రీ పనివారికీ ధరలు, బిల్లుల భారం తప్పడం లేదు. వారు వృత్తిని నిర్వహించే ప్రాంతం ఆధారంగా రూ.3 వేల నుండి రూ.7 వేల వరకు అద్దెకు గదులు తీసుకోవాల్సి వస్తోంది. గతంలో బొగ్గుల ఇస్త్రిపెట్టె రూ.3 వేల వరకు ఉండగా ఇప్పుడు రూ.6 వేలైంది. గ్యాస్, విద్యుత్ ఆధారంగా పనిచేసే పెట్టెలైతే రూ.10 వేల వరకూ ఉన్నాయి. పట్టణంలో సుమారు 90 మంది వరకూ ఇస్త్రి చేసేవారు ఉన్నారు. కరెంటు ఇస్త్రికైతే నెలకు రూ.2500 వరకు బిల్లు వస్తోంది. గ్యాస్ ఆధారంగా అయితే వాణిజ్య సిలిండర్లు రెండున్నర వరకూ



ఆక్రమణల్లో ఉన్న ధోబీఘాట్

పడుతున్నాయి (ఒక్కో సిలిండర్ రూ.1100). ఒక్కో జతకు రూ.25 తీసుకుంటున్నారు. రోజుకు రూ.800 వరకూ సంపాదిస్తున్నా ఇందులో ఖర్చులన్నీ పోనూ మిగిలేది అంతంతమాత్రమేనని, అందులోనూ నిత్యావసరాల ధరల పెరుగుదలతో గిట్టుబాటు కావడం లేదని వృత్తిదార్లు వాపోతున్నారు. ఈ క్రమంలో బొగ్గు ఇస్త్రిపెట్టెలు, మొబైల్ బండ్లు ఉచితంగా ఇవ్వాలని, నాణ్యమైన బొగ్గును కిలో 10కి అందించాలని, విద్యుత్‌ను 200 యూనిట్ల వరకూ ఉచితంగా ఇవ్వాలని, గ్యాస్ అయితే 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నారు.

సత్రాల్లోకి రానివ్వకుండా వివక్ష

కుటుంబంలో ఎవరైనా చనిపోతే దేవాలయాలు, సత్రాల్లో కొద్దిరోజులు నివాసం ఉండాలనే ఆచారాన్ని కొందరు పాటిస్తుంటారు. ఇందుకుగాను పట్టణంలో ఓగేరు వాగువద్ద సత్రం, హనుమాయమ్మ సత్రం, గుండయ్య సత్రం ఉన్నాయి. మృతుల కుటుంబీకులు ఎరైనా సంత్రాలకు వెళ్తే వివరాలు అడిగిన సిబ్బంది వెనకబడిన సామాజిక తరగతుల వారైతే గదులు అద్దెకు ఇవ్వడానికి ఏదో ఒక సాకుతో నిరాకరిస్తున్నారు. పెత్తందారీ సామాజిక తరగతుల వారికే అద్దెకిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకూ ఒక సత్రం ఏర్పాటు చేయాలని రజక వృత్తిదార్లు కోరుతున్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ హనుమంతరావు

కోవిడ్ తరువాత ఎక్కువైన గుండెపోట్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కోవిడ్ మహామ్మారి తరువాత ప్రజలకు గుండెపోట్లు మరింత పెరిగాయని, ఎప్పటికప్పుడు గుండె పరీక్షలు చేయించుకోవాలని అనన్య హాస్పిటల్ హృద్రోగ నిపుణులు డాక్టర్ చల్లా నాగరాజురెడ్డి సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం పోలీసులకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.హనుమంతరావు సారధ్యంలో సుమారు 200 మంది హోంగార్డ్స్, కానిస్టేబుల్స్, పోలీస్ అధికారులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదని, నిత్యం ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసులు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఈ క్రమంలో వైద్యశిబరం ఏర్పాటు చేసిన డాక్టర్ నాగరాజురెడ్డిని అభినందించి ఘనంగా సత్కరించారు. పట్టణ, రూరల్ సిఐలు బి.బ్రహ్మం, పి.శ్రీనివాసరావు, పెదకూరపాడు సిఐ పి.సురేష్, పట్టణ, రూరల్ ఎస్ఐలు సంధ్యారాణి, అమీనుద్దీన్ పాల్గొన్నారు.

పరుగుల వీరునికి సిఎం హామీ

ప్రజాశక్తి - వినుకొండ



యువ పరుగుల వీరుడు జాతీయ, అంతర్జాతీయ పరుగు పోటీల్లో అవార్డులు పొందిన షేక్ అబ్దుల్లా లండన్‌లో జరిగే పోటీల్లో, ఒలింపిక్స్‌లో పాల్గొనే ఆర్థిక స్తోమత టిడిపి నాయకులు ఎమ్‌డి కరీముల్లాతో సిఎం చంద్రబాబును ఆదివారం కలిశారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందించేందుకు హామీ సిఎం హామీనిచ్చారని అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో వెళ్లిన పర్యాటకులు కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాల గట్టు, బోధివృక్షాన్ని సందర్శించారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేథ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.42 వేల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



అన్నదాత సుఖీభవ విధివిధానాలు ప్రకటించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలు ప్రకటించాలని కోరుతూ రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. కార్యక్రమానికి. కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ అధ్యక్ష వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులైనా అన్నదాత సుఖీభవ విధివిధానాలను ప్రకటన చేయలేదన్నారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేల పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వర్షాల వల్ల పంటలు దెబ్బ తినడంతో రైతులు సాయం కోసం ఎదురు చూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదని అన్నారు. కౌలు రైతుల అందరికీ గుర్తింపు కార్డులు ఇస్తున్నామని చెప్పిన ప్రభుత్వం ఆ మాటనూ నెరవేర్చలేదన్నారు. ఓసీ కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులతోపాటు బ్యాంకు రుణాలివ్వాలన్నారు. వర్షాల వల్ల



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పంటలు దెబ్బతిన్న రైతులకు పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గద్దె చలమయ్య, ఎం.నరసింహారావు, ఆర్.పూర్ణచంద్రరావు, సిహెచ్ లక్ష్మీనారాయణ, జె.భగత్, శివ, రాజకుమార్, అశోక్, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

రెయిలింగ్ లేక డేంజర్

ప్రజాశక్తి-ఈపూరు

నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాల్వ నుండి మేజర్ కాల్వలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని అగ్నిగుండాల గ్రామ సమీపంలో పెరుమాళ్లపల్లి మేజర్ కాల్వ బ్రిడ్జిపై రెండువైపులా ఏర్పాటు చేసిన ఇనుప రెలింగ్ ఒక వైపు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. అగ్నిగుండాల గ్రామస్తులకు, రైతులకు పొలం పనులకు వెళ్లాలన్నా, ప్రభుత్వ కార్యాలయాలలో పనుల కోసం మండల కేంద్రం ఈపూరు రావాలన్న ఇదే ప్రధాన రహదారి అవటంతో ప్రయాణం భయం భయంగా ఉంది. నల్లగొండ తండా, ఊడిజర్ల గ్రామస్తులు వినుకొండ పట్టణానికి వెళ్లాలన్నా ఇదే మార్గంలో



తరచూ రాకలు సాగిస్తుంటారు. రెలింగ్ లేని కారణంగా కాల్వలో గేదెలు పడి మృతి చెందిన సంఘటనలఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కాల్వలో పడి గాయాల పాలైన సందర్భాలనూ గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. పదేళ్ల కిందటి నుండే ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

దొడ్లేరు-బెల్లంకొండ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - క్రోసూరు

దొడ్లేరు నుండి బెల్లంకొండ వరకు గుంతలు పడిన ఆర్ అండ్ బి రోడ్డును తక్షణమే మరమ్మతులు చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. అమరావతి నుండి బెల్లంకొండ అడ్డ రోడ్డు వరకు జరుగుతున్న రెండు లైన్ల ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు దొడ్లేరు వరకు జరుగుతున్నాయని, దొడ్లేరు నుండి బెల్లంకొండ వరకు పనులు ప్రారంభించలేదని పేర్కొన్నారు. ఆర్ అండ్ బి రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు వలన గుంతలు పడి కనీసం బస్సులో ప్రయానించాలన్నా ఇబ్బందిగా మారిందని, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు బస్సులో ప్రయాణం చేయలేకపోతున్నారని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని కోరారు.

రేపు తైక్వాండో జిల్లా జుట్టు ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆద్వర్యంలో తెనాలి చెంచుపేటలోని డిఎస్ఎ స్టేడియంలో మంగళవారం తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 01-01-2006 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్ కార్డు, ప్రిన్సిపల్ ధ్రువీకరణతో 10వ తరగతి మార్కుల జాబితాతో హాజరు కావాలని సూచించారు.

కోకొల్లలుగా సమస్యలు - పరిష్కరించాలని తీర్మానాలు

పేదల ఇళ్లస్థలాలకు పట్టాలివ్వాలి



ఆత్మకూరు మహాసభల జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఇప్పటం రోడ్డు లోని వైయస్సార్ కాలనీ నుంచి వడ్డెరపాలెం వరకు డ్రైనేజీ నిర్మించాలని, వడ్డెరపాలెం బైపాస్ రోడ్డు నుంచి ఆత్మకూరు పంచాయతీ రోడ్డు వరకు డ్రైనేజీ నిర్మించాలని, ఆత్మకూరు పంచాయతీ సెంటర్ నుంచి తెనాలి రోడ్డు వరకు రోడ్లు, గ్రామంలోని వైయస్సార్, నిమ్మగడ్డ రామ్మోహన రావు కాలనీ, వివిధ పోరంబోకు స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఇప్పటం రోడ్డు నుండి పద్మశాలి స్మశానం వరకు రోడ్డు వేయాలని, దళిత మాదిగలకు స్మశాన స్థలం కేటాయించాలని ఆత్మకూరు గ్రామ 1,2, శాఖల మహాసభలు ఏకగ్రీవంగా తీర్మాని ంచాయి. ఆదివారం ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్‌లో బండపల్లి అనం తరావు ప్రాంగణంలో నాయకులు చిట్టేల సీతారామాంజనేయులు, కాంద్రు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈమహాసభల్లో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపికి సీట్లు తగ్గి సంకీర్ణ ప్రభుత్వంలో ఉండి కూడా తన దూకుడుగా వ్యవహరిస్తున్నదని, రాష్ట్రంలో రాష్ట్ర రాజకీయాలు లడ్డు చుట్టు తిరిగే విధంగా ఉంది నిజంగా లడ్డులో కల్తీయే జరిగితే దానిమీద విచారణ జరిపి దోషులను శిక్షించవచ్చు కానీ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో జరుగుతున్న వ్యవహారంగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి ఇసుక పాలసీలో ఎటువంటి తేడా లేదని, గతంలో ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు,ఇంటి యజమానులు ఇబ్బందులు పడ్డారు అదే పరిస్థితి ఈరోజు ప్రజలు ఎదుర్కొంటున్నారు దీనికి వ్యతిరేకంగా అందరికీ ఇసుక అందించాలని నాలుగో తేదీన మండల కేంద్రాల్లో నిరసనలో కార్మికులు ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య , తదితరులు ప్రసంగించారు. అనంతరం గ్రామశాఖల నూతన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఒకటవ శాఖ కార్యదర్శిగా నల్లక శ్రీధర్, రెండో శాఖ కార్యదర్శిగా వుద్దంటి దుర్గారావులను ఎన్నుకున్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



పెదకాకానిలో మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి - పెదకాకాని

భారీ వర్షాలతో మండలంలో వరి, పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంబూరు శాఖ మహాసభ నాయకులు జొన్నల అప్పిరెడ్డి అధ్యక్షతన నంబూరు మాకిరెడ్డి పెద్ద సాంబి రెడ్డి భవనం సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. మహాసభలో వరదలతో నష్టపోయిన రైతు, కౌలు రైతులకు పరిహారం పెంచాలని, దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని తీర్మానం చేశారు. మహాసభ శాఖా కార్యదర్శిగా మన్యం శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభలో నేతాజీ ప్రసంగించారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు, రూ.10వేలు ఇళ్లకు రెమ్యూనరేషన్ ప్రకటించి ందని, అవి కూడా అందరికీ జమకాలేదన్నారు. వాస్తవ పరిస్థితిలో రైతులకురూ.50వేల వరకు ఖర్చు అయ్యిం దన్నారు. నష్టపరిహారం జమ కాని వారు ఆందోళన చెందు తున్నారని నష్టపోయిన ప్రతి ఒక్కరికి రెమ్యూనేషన్ ఇవ్వాలని కోరారు. మహాసభలో సిపిఎం మండల కార్యదర్శి నన్న పనేని శివాజీ, అన్నపురెడ్డి వెంకటరెడ్డి నరిశెట్టి నాగరత్నం ఆరుదల నాగలక్ష్మి మేడిది రాంబాబు కనపర్తి ఆదం మా భూ మాస్టర్ దంతరాజు వేణు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ రైతులకు వార్షిక కౌలు చెల్లించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు : అసైన్డ్ రైతులకు పెండింగ్ ఉన్న మూడు సంవత్సరాల వార్షిక కౌలు వెంటనే చెల్లించాలని, మందడంలో హిందూ స్మశానాన్ని అభివృద్ధి చేయాలని, దళితు లకు స్మశాన స్థలాన్ని కేటాయించాలని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతూ ఆదివారం రాజధాని ప్రాంతం మందడంలో సిపిఎం శాఖ మహాసభ తీర్మానిం చింది. ముందుగా సభలో అభ్యుదయ కవి గుర్రం జాషువా129వ జయంతిని పురస్కరిం చుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతు నిరంతరం వీఐపీలు తిరిగే మందడంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, రాజధానిలో పేదలకు నిర్మించిన టిడ్కో గృహాలకు సంబంధించిన బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు. మహా సభ లో మందడం సిపిఎం శాఖా కార్యదర్శిగా షేక్ జానీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణ, కుంభా ఆంజనేయులు, ఎర్రమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరులో జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎం రవి తదితరులు

నీటి ముంపు నుండి నివారించాలి



రత్నాలచెరువు మహాసభలో మాట్లాడుతున్న పి బాలకృష్ణ

ప్రజాశక్తి మంగళగిరి : రత్నాల చెరువులో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేయాలని, శ్రామిక నగర్ నుండి చిన్న కాకాని వరకు ఉన్న కాలువలో పూడిక తీసి రత్నాల చెరువును నీటి ముంపు నుండి నివారించాలని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ, ఎమ్మెస్ ఎస్ నగర్ లో ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ వద్ద ఇరువైపులా బస్సు షెల్టర్ నిర్మించాలని, సుందరయ్య నగర్‌లో ఇళ్లపైన 33 కెవి విద్యుత్ లైన్లను తొలగించాలని, ఎంఎస్ఎస్ నగర్‌లో యుపిహెచ్‌సిలో వైద్యుల్ని నియమించాలని, నేతన్న నేస్తం చేనేత కార్మికులందరికీ వర్తింప చేయాలని తదితర అంశాలను ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన సిపిఎం రత్నాల చెరువు శాఖా మహాసభ తీర్మానించింది. అనంతరం రత్నాల చెరువు శాఖా కార్యదర్శిగా ఎం చంద్రారావు ఎన్నికయ్యారు. నాయకులు కే వెంకటేశ్వరావు అధ్యక్షతన మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు పి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం నాయకులు జె శివ భవనారాయణ, జె లక్ష్మి, జి దుర్గాప్రసాద్, పి అప్పారావు పాల్గొన్నారు.



మంగళగిరిలో మాట్లాడుతున్న చంగయ్య

ప్రజాశక్తి మంగళగిరి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో నాయ కులు ప్రసాదం రామ చంద్ర రావు అధ్యక్షతన నిర్వహించిన శాఖ మహాసభలో మున్సిపల్ రంగంలో కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కారానికి, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం శాఖా కార్యదర్శిగా పి రామచంద్రరావు, 15 మందితో శాఖను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలాజీ పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి



గుండిమెడలో నాయకులకు నివాళులర్పిస్తున్న డి వెంకటరెడ్డి తదితరులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఇటీవల అధిక వర్షాలు కురవడం, కృష్ణా నదికి వరదలు రావడంతో ఇసుక కొరత ఏర్పడి, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని, వెంటనే ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామంలో గుండిమెడ, మెల్లెంపూడి సిపిఎం శాఖా మహాసభలు సిపిఎం నాయకులు పల్లె కృష్ణ, కురగంటి ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం దక్షిణ భారత ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, సిపిఎం జాతీయ నేత సీతారాం ఏచూరి చిత్రపటాలకు సిపిఎం సీనియర్ నాయకులు కంచర్ల జేమ్స్, నాగ పోగు విజయరాజు , నవయుగ కవి గుర్రం జాషువా చిత్రపటానికి పల్లె కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించే విధంగా ఇసుకను అందుబాటులోకి తెచ్చి, కార్మికులకు పనులు కల్పించాలని, వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెలంపూడి మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఉపాధి కార్మికులకు వెంటనే పనులను కల్పించాలని, దళిత స్మశాన స్థలానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, గుండిమెడ గ్రామాన్ని కార్పొరేషన్ లో విలీనం కాకుండా గ్రామంగానే ఉంచాలని పలు అంశాలను సిపిఎం గుండిమెడ శాఖ మహాసభ తీర్మానం చేసింది మహాసభలో మెల్లంపూడి శాఖా కార్యదర్శిగా కంచర్ల సాంబశివరావు, గుండెమెడ శాఖా కార్యాదర్శిగా పల్లె కృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల జేమ్స్, కురగంటి ప్రభాకర్ రావు, భగవాన్ నాయక్, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు : ఇసుక సమస్యతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేవని, ఇసుకను వెంటనే అందు బాటులోకి తేవాలని, ఉన్న ఉద్యో గులను రాజకీయకారణాలతో తొలగిస్తున్నారని దానిని ఆపాలని, పంట నష్టపో యిన రైతులందరికీ పరిహారం అందజేయాలని పొన్నూరు శాఖ మహాసభ తీర్మానించింది. పొన్నూరు యుటిఎఫ్ కార్యాలయంలో నాయ కులు రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, అక్టోబర్ 4న జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం శాఖా కార్యదర్శిగా గోనిగల ప్రభుదాసును ఎన్నుకున్నారు. మహాసభ ముందుగా జెండా ఆవిష్కరణ, సిపిఎం జాతీయ నేత సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పించారు.



పొన్నూరు మహాసభలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ



ఎబిసి సెంటర్‌లో కుక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రతిరోజూ వంద కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ ఏబిసి సెంటర్‌లో ప్రతిరోజూ వందకు తగ్గకుండా వీధికుక్కలకు యాంటీబర్త్ కంట్రోల్ (ఏబిసి) సర్జరీలు చేసేలా కాంట్రాక్ట్ సంస్థ చర్యలు చేపట్టాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులిశ్రీనివాసులు స్పష్టం చేశారు. అదివారం కమిషనర్ ఏటుకూరు రోడ్డులోని ఏబిసి సెంటర్, వర్మీకంపోస్ట్ యూనిట్, వెంగళాయపాలెంలోని గోశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఏబిసి సెంటర్‌లోని ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచుతున్న ప్రాంతాలు, వాటికి అందిస్తున్న ఆహారం, చికిత్స విధానాలను డాక్టర్లను అడిగి తెలుసుకొని, ప్రతిరోజూ తెస్తున్న కుక్కలు, ఆపరేషన్ చేసిన కుక్కల వివరాలను రిజిస్టర్‌లో పరిశీలించారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధికుక్కల నియంత్రణపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి నియంత్రణకు ఏటుకూరు రోడ్‌లోని ఏబిసి సెంటర్‌లో స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుందన్నారు. ప్రతిరోజు 100 కుక్కలకు ఆపరేషన్లు జరిగేలే ఏజన్సీ తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అందుకు తగిన విధంగా మౌలిక వసతులను జిఎంసి కల్పిస్తుందన్నారు. ఆపరేషన్ జరిగిన కుక్కలకు నిర్దేశిత సమయం వరకు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, తగిన చికిత్స, ఆహారం అందించాలన్నారు. ఏబిసి సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏ వీధిలో నుండి తెచ్చిన కుక్కలను ఆపరేషన్ తర్వాత అదే వీధిలో విడిచి పెట్టాలన్నారు. వర్మీ కంపోస్ట్ యూనిట్‌ని పరిశీలించి, నగరంలోని జిఎంసి పార్క్‌లో, డివైడర్‌ల మధ్యలోని మొక్కలకు అందించాలన్నారు. కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, నగరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్రాజెక్ట్‌కు తరలించాలన్నారు. పర్యటనలో సిటీప్లానర్ డి.రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, ఆనందకుమార్, రాంబాబు, డిఈఈ సతీష్, ఏసిపి మురళి తదితరలు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న మురళీ కాంత్, గీతా కాంత్

నెహ్రూనికేతన్‌కు జాతీయ స్థాయి పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌నకు లీడ్ స్కూల్ వారు అందించే జాతీయస్థాయి ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీత కాంత్ అందుకున్నారు. హైదరాబాదు కొండాపూర్ హోటల్ మెరీడియన్ లో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో లీడ్ స్కూల్ సీఈవో సుమిత్ మెహతా, బిజినెస్ హెడ్ దీపక్ హరిహరన్, జోనల్ అకాడమీ హెడ్ వర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు మురళీ కాంత్ తెలిపారు. దేశంలో లీడ్ స్కూల్ కరికులం అమలు చేస్తున్న 3 వేల పాఠశాలలలో 10 జాతీయస్థాయి ఉత్తమ పాంశాలలను ఎంపిక చేయగా, ఏడవ స్థానంలో నెహ్రూ నికేతన్ నిలిచిందన్నారు. చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంచి దృశ్య, శ్రవణ విధానంలో బోధన పద్ధతులను అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహిస్తామని చైర్మన్ రఫాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు అంశాలను ఆమోదం కోసం ఎజెండాలో పెట్టామని, కౌన్సిలర్లు, అధికారులు నిర్ణీత సమయంలో హాజరవ్వాలని కోరారు.

కాశిపాడులో జనవాణి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రజా సమస్యలపై మండలంలోని కాశిపాడులో జనసేన-జనవాణి కార్యక్రమ ఆదివారం నిర్వహించారు. ప్రజల నుండి దరఖాస్తులు తీసుకున్నారు. పింఛన్లు, గృహ రుణాలపై పలువురు అర్జీలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సాంబయ్య, జనసేన మండల అధ్యక్షులు ఎం.వెంకట చలపతిరావు, గ్రామ అధ్యక్షులు కె.యాదయ్య, రమేష్, యశ్వంత్, హనుమంతరావు, బుచ్చిబాబు, సాంబశివరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెలుగు సమాఖ్య అధ్యక్షులుగా మహంకాళి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండల వెలుగు సమాఖ్య అధ్యక్షులుగా అబ్బరాజుపాలేనికి చెందిన రాయపాటి మహంకాళి ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు నియామక పత్రాన్ని టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్ ఆదివారం అందించారు. జి.లీలావతి, జి.పుష్పలత, ప్రసాద్, దాసు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి సర్పంచ్ సాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన శీలం నాగరాజు భార్య శ్రీలక్ష్మి గుండెపోటుతో మృతి చెందగా ఆమె భౌతికకాయాన్ని సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.5 వేల సాయాన్ని అందించారు. ఆయనవెంట నాయకులు ఎ.నాగేశ్వరరావు, కె.రామారావు, జె.శివ, యు.శ్రీను, మంగ్య నాయక్ ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు వైద్యులను నియమించండి

ప్రజాశక్తి- మాచర్ల

రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన హెల్త్ సెంటర్లకు డాక్టర్లను నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం బాధాకరమని సిపిఐ మాచర్ల ఏరియా కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని 4వ వార్డు అర్బన్ హెల్త్ సెంటర్, పాత మాచర్ల జండా చెట్టు, 10వ వార్డు గౌడ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లకు ఏడాది నుండి వైద్యులు లేరన్నారు. ఇటీవల వర్షాలకు విష జ్వరాలు వ్యాప్తి చెంది అధిక సంఖ్యలో ప్రజలు అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కట్టారన్నారు. ఇదే అదునుగా వారు మలేరియా, టైఫాయిడ్, డెంగీ బాధితుల నుండి రూ.లక్షలు దండుకున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా వైద్యులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

105 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని తురకపాలెంలో ధూళిపాళ్లకు చెందిన ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. బెల్లంకొండ లూర్ధురాజు ప్రథమ వర్ధంతి సదర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని తహశీల్దార్ భవానీశంకర్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామానికి సర్పంచ్‌గా, ధూళిపాళ్ల సొసైటీ డైరెక్టర్‌గా బెల్లంకొండ లూర్ధురాజు మంచి సేవలు అందించారన్నారు. అనంతరం 105 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో లూర్ధురాజు కుమారులు శౌరయ్య, శ్యామ్, సర్పంచ్ ఎం.చంద్రశేఖర్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక, సంక్షేమ బోర్డు కోసం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఇసుక విధానంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) కోరింది. భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక సులభంగా సరఫరా అయ్యేలా చూసి కార్మికుల ఉపాధిని కాపాడాలని విన్నవించింది. ఈ మేరకు నరసరావుపేటలో సీతారాం ఏచూరి సంస్మరణ సభకు హాజరైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు నాయకులు ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.ప్రసాదరావు, షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు శాసనమండలిలో, అసెంబ్లీలో ప్రస్తావించాలని, నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఇసుక కొరతకు పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఇసుక కొరత వల్ల అనేకమంది భవన నిర్మాణ రంగంలో నిర్మాణాలు కుంటుపడి కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. భవన నిర్మాణరంగంపై ఆధారపడి సిమెంట్, పెయింట్, ఐరన్ షాపుల యజమానులు తమ వాప్యారాలు పడిపోవడంతో తమ వద్ద పనిచేసే కార్మికులకు వేతనాలు సరైన సమయంలో ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. భవన నిర్మాణ రంగాన్ని ఆధారం చేసుకుని నడిచే 40 రకాల పనులు కుంటుపడ్డాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుకను నిరంతరాయంగా సరఫరా చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కె.సురేష్, బి.ఏడుకొండలు, కె.ఆంజనేయులు, ఆర్.ఆంజనేయులు, బి.బాలకోటయ్య, సాల్మన్‌రాజు కోటేశ్వరరావు ఉన్నారు.



బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ది బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చిలకలూరిపేట 36వ వార్షిక సర్వసభ్య సమావేశం స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ప్రధాన కార్యదర్శి ఎవి. శివయ్య నివేదిక ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. సంఘ సభ్యులు మరణిస్తే వారి కుటుంబాలకు అందించే రూ.50 వేల ఫ్యామిలీ వెల్ఫేర్ అసిస్టెన్స్‌ని రూ.75 వేల పెంచుతూ నిర్ణయించారు. మట్టి ఖర్చుల కింద ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.10 వేలను రూ.12 వేలకు, ఉద్యోగంలో రిటైర్డ్ అయిన వారికి మరణించిన తరువాత మట్టి ఖర్చుల కింద రూ.5 వేలను రూ.6 వేలకు పెంచారు. పిల్లల చదువుల నిమిత్తం స్కాలర్‌షిప్పు రూపంలో ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పెంచామన్నారు. 10వ తరగతి వారికి ప్రస్తుతం రూ.3,500 ఇస్తున్నామని, దాన్ని రూ.5 వేలకు పెంచామన్నారు. ఇంటర్మీడియట్ వారికి రూ.4500 నుండి రూ.6 వేలకు, డిగ్రీ ఆపై చదువుతున్న వారికి రూ.5500 నుంచి రూ.7 వేలకు పెంచామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా యు.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా జి.విజయవర్ధనరావు, సొసైటీ కార్యదర్శిగా ఎ.వి.శివయ్య, డైరెక్టర్లుగా ఎ.వెంకటరావు, బి.గోవిందరెడ్డి, జి.శ్రీనివాసరావు, పి.శేషయ్య, పి.రాజేంద్రప్రసాద్, డి.సుధీర్ కుమార్, ఎం.గంగరాజు ఎన్నికయ్యారు. సిపిఎం సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. సిహెచ్ కృష్ణమూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణరాజు, డాక్టర్ సురేష్‌బాబు, జెఎస్ఎన్ శ్రీనివాసరావు, వెంకటరమణ పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రజానాట్య మండలి నాయకులు టి.కోటేశ్వరరావు అభ్యుదయ గేయాలు ఆలపించారు.

భూ రీసర్వే అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి పాలనలో భూ సర్వే పేరుతో వినుకొండలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రెవిన్యూ పరిధిలో భూ సర్వే ద్వారా అనేక అక్రమాలు జరిగాయని, ఒకరి భూమిని మరొకరికి ఆన్‌లైన్ చేశారని, భూమిలేని వారికి భూమి ఉన్నట్టుగా, భూమి కలిగిన రైతు విస్తీర్ణంలో కొంత మరొకరి పేరుపై చేర్చారని చెప్పారు. వినుకొండ పట్టణానికి చుట్టూ ఉన్న బ్రాహ్మణపల్లి, వెంకుపాలెం, తిమ్మాయిపాలెం, వినుకొండ, హస్తనాయునిపాలెం, చాప్రగడ్డ పాడు రెవిన్యూ పరిధిలోని భూములు కోట్ల రూపాయలు విలువ పగడంతో అధికారులు అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. ఫీల్డ్ మ్యాప్‌లో హద్దురాయి నుండి సర్వే కొలతలు వేయకుండా పొలం గట్ల వద్ద సర్వే మిషన్లు పెట్టి అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ కిరణ్ కుమార్, సర్వేయర్ రవికుమార్, వీఆర్వోలు బ్రహ్మరెడ్డి, శ్రీధర్, అనిత రెడ్డి, ప్రైవేట్ సర్వేయర్ సుభాని, వెంకటేష్‌పై విచారణ చేయాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

క్వార్టర్ ఫైనల్ దశకు ఫుట్‌బాల్ పోటీలు



ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక లయోల హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు రెండోరోజైన ఆదివారం కొనసాగాయి. అండర్-17 విభాగంలో బాలబాలికల జట్లు రసవత్తరంగా తలపడుతున్నాయి. బాలుర విభాగంలో గుంటూరు, ప్రకాశం, కడప, తూర్పుగోదావరి, అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నం బాలికల విభాగంలో కర్నూలు, చిత్తూరు, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, కడప జట్లు క్వార్టర్ ఫైనల్స్ వచ్చాయని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ ఎన్.సురేష్ కుమార్ తెలిపారు. పోటీలను పిఇటిలు టి.ఎలమంద, ఆర్.రాధాకృష్ణమూర్తి, వైవి చిరంజీవిరావు, బి.కొండలు, కె.రాజేష్, పర్యవేక్షిస్తున్నారు. పోటీల పరిశీలకులుగా డాక్టర్ ప్రభాకర్ వ్యవహరిస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కిడ్స్ విద్యార్థులు



ప్రజాశక్తి- మాచర్ల రూరల్

జిల్లా స్థాయి చెస్, బ్యాట్మెంటెన్ పోటీలకు మాచర్ల పట్టణానికి చెందిన కిడ్స్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదివారం మాచర్ల నియోజకవర్గ స్థాయిలో క్రీడలు నిర్వహించారు. కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు చంద్ర మహేష్, వేముల ఆనంద్, భార్గవ శ్రీనివాస్ నాయక్, జూనియర్ విభాగంలో తులసీరామ్, పవన్‌సాయిరెడ్డి, హారిక, ఈశ్వర్ రేవంత్ చెస్ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బ్యాడ్మింటెన్‌లో షణ్ముక సాయి, జూనియర్ విభాగంలో చల్లా విజయ్ చక్రవర్తి, యశ్వంత్ కుమార్ ఎంపికయ్యారు. వీరు త్వరలో గుంటూరులో జరిగే జిల్లా పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన వారితోపాటు పిఇటిలు రామారావు, ఆనంద్‌ను కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం జొన్నలగడ్డ రామకృష్ణ శాస్త్రి, శివ ప్రసాద్, పవన్ అభినందించారు.

అథ్లెటిక్స్‌లో సత్తెనపల్లి జెడ్‌పి బాలికల సత్తా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో సత్తెనపల్లి జెడ్‌పి బాలికల పాఠశాల విద్యార్థినులు విజయకేతనం ఎగురవేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో బాలికల పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో డిస్క్ త్రో, షాట్ పుట్‌లో ఎం.దీపిక ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, 800 మీటర్ల పురుగు పందెంలో టి.మహాలక్ష్మీ మొదటి స్థానాన్ని, 4x100 మీటర్ల రిలేలో వై.అక్షయ, వై.హనీశ్రీ, కె.కల్పన, వి.మల్లిక,4x400 మీటర్ల రిలేలో ఎం.రాధ, టి.మహాలక్ష్మి, ఎం.దీపిక, పి.షారోన్ పుష్ప విజయం సాధించారు. జూనియర్ విభాగంలో 600, 400 మీటర్ల పురుగులో ఐ.వైష్ణవి,100 మీటర్లలో టి.హేమలత మొదటి స్థానం సాధించారు. 400x100 మీటర్ల రిలేలో ఎం.వైష్ణవి, టి.మాదవి, టి.హేమలత విజయం సాధించారు. వీరిని హెచ్‌ఎం టి.మాదవీలత, పిఇటిలు కె.సునీత, సిహెచ్.శివగోవర్ధన. పి.శాస్త్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రగతిపథంలో తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ

- 2024-25 ఆదాయం లక్ష్యం రూ.6 కోట్లు
- 17 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 17 గిడ్డంగులు
- రైతు బంధు పథకం పున:ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి-తెనాలి

ధాన్యాగారంగా పేరున్న డెల్టా ప్రాంతలో ఉన్న తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ గణనీయమైన అభివృద్ధిని సాధించి, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తుందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జొన్నలగడ్డ వెంకటసుబ్బారావు తెలిపారు. దాదాపు 17వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల సరకు నిల్వలకు 17 గోడౌన్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆర్థిక సంవత్సంలో రైతు బంధు పథకం పున:ప్రారంభంతోపాటు రూ.6.60కోట్ల ఆదాయ లక్ష్యంతో పనిచేస్తున్న మార్కెట్ యార్డు అభివృద్ధిపై ఆయన వివ రాలు వెల్లడించారు.

డెల్టా ప్రాంతంలో తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పెద్దది. కమిటీ పాలకవర్గం గడువు 2023 ఫిబ్రవరితో ముగియటంతో ప్రస్తుతం మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఇక్కడ సాధారణంగా ధాన్యం, జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలు సాగుచేస్తారు. దీనికి అదనంగా నిమ్మ పంట సాగు చేసే రైతులు కూడా అధికమే. ఇదే ఆవరణలో నిమ్మకాయల వ్యాపారులకు ప్రత్యేకంగా మార్కెట్ ఉంది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు నిమ్మ కాయలు ఎగుమతి కూడా ఉంది. ఈ ప్రాంత రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ యార్డు పరిధిలో సరకు నిల్వ ఉంచుకునేందుకు గోడౌన్స్ అందుబాటులో ఉన్నాయి. దాదాపు 17వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 17 గోడౌన్స్ అందుబాటులో ఉన్నాయి.



మార్కెట్ కమిటీ ముఖద్వారం

అభివృద్ధి పనులు... ప్రతిపాదనలు

యార్డులో గత ఐదేళ్ళ కాలంలో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. మొదటిగా రైతుల అవసరాల నిమిత్తం రూ.కోటితో గోడౌన్లకు మరమ్మతులకు ప్రతిపాదించారు. యార్డు కార్యాలయాన్ని రూ.20లక్షలతో ఆధునీకరించారు. రూ.20లక్షలతో గొర్రెల షెడ్డు నిర్మించారు. యార్డు నిధులు రూ.6లక్షలు, మున్సిపల్ నిధులు రూ.11లక్షలు, వ్యాపారులు సమిష్టిగా అందించిన రూ.4లక్షలతో ఎద్దులబండి, దానిపై పంటను తీసుకు వెళుతున్న రైతు కుటుంబం చిహ్నాన్ని, జండా దిమ్మెను యార్డు ముఖద్వారం వద్ద తెనాలి కళా కారులతో ద్వారా అందంగా తీర్చి దిద్దారు. పడిపోయిన ప్రహరీగోడ నిర్మాణానికి రూ.60లక్షలతో, యార్డు ముం దున్న కాళీ స్థలంలో రూ.1.20 కోట్లతో నిర్మాణాలను, రూ.35 లక్షలతో టాయిలెట్ బాక్సుల ఏర్పాటుకు ప్రతి పాది ంచారు. ఈ ఏడాది రూ.6 కోట్ల ఆదా యం లక్ష్యంగా పనిచేస్తున్నారు.



ఎద్దుల బండిపై పంట తీసుకువెళుతున్న రైతు కుటుంబం చిహ్నం



యార్డులో గోడౌన్స్

రైతుబంధు తిరిగి ప్రారంభం

రైతులకు ఎంతో ఆసరాగా ఉండే రైతు బంధు పథకం గత ఐదేళ్ళ కాలంగా నిర్వీర్యమైంది. 2018-19లో 140 మందికి రూ.135.35 లక్షలు రైతు బంధు రుణాలు అందించాం. తదుపరి 2019-20 నుంచి 2023-24 వరకూ రైతు బందు అమలే లేదు. ఈ పథకంలో రైతులు గోడౌన్లలో దాచుకున్న పంట ఉత్పత్తులపై రుణాలు తీసుకుంటారు. ఐదేళ్ళ కాలంలో నిర్వీర్యమైన పథకాన్ని ఈ ఏడాది పున:ప్రారంభిస్తున్నారు. దాదాపు రూ.2కోట్ల రుణాలు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

రూ.6కోట్ల ఆదాయ లక్ష్యంగా పనిచేస్తాం

జొన్నలగడ్డ వెంకట సుబ్బారావు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ



గత ఐదేళ్ళ కాలంగా రైతు బంధు పథకం నిలిచిపోయింది. గతంలో 150 నుంచి 200 మంది రైతులకు రైతు బంధు కార్డులు ఉండేవి. వాటి ద్వారా రుణాలు పొందేవారు. అయితే ఈ ఏడాది రైతు బంధు పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుం టున్నాం. దీని ద్వారా ఒక్కోరైతు రూ.2లక్షల వరకూ రుణం పొందే వీలుంటుంది. అదే విదంగా ఈ ఏడాది రూ.6.60కోట్లు మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యం. ఈ ఏడాది సెప్టెంబరు 18 వరకు రూ.3.20కోట్లు వసూలు చేశాం. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం.



మంగళగిరి క్లీన్ అండ్ గ్రీన్‌కు మంత్రి లోకేష్ చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ దృష్టి సారించారు. నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సొంతంగా 5 గ్రాస్ కటింగ్ మిషన్లు కొనుగోలు చేయడంతో పాటు వాటిని వినియోగించి పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించేందుకు ఐదుగురు కార్మికులను నియమించారు. వీరికి అవసరమైన జీతభత్యాలను నారా లోకేష్ సొంత నిధుల నుంచే వెచ్చిస్తున్నారు. ఒక్కో గ్రాస్ కటింగ్ మిషన్ కొనుగోలుకు రూ.18 వేల వరకు ఖర్చు చేశారు. ఆదివారం ఉదయం నుంచే మంగళగిరి పట్టణంలోని పానకాల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఘాట్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో యంత్రాల సాయంతో గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయా పనులను టీడీపీ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు. మంగళగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మంత్రి లోకేష్ చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మెడికల్‌క్యాంప్‌లో ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్యులు.

మెల్లంపూడిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని మెల్లంపూడి గ్రామంలో టీడీపి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెల్లంపూడి పరిసరప్రాంత ప్రజలకు కార్డియాలజీ, రుమటాలజీ, జనరల్ మెడిసిన్, బీ.పి, జి.ఆర్.బి.ఎస్, ఈ.సి.జి, ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరా సుబ్బారావు మాట్లాడుతూ నారా లోకేష్ స్ఫూర్తితో మెల్లంపూడి పరిసంౕప్రాంత ప్రజలకు ఆస్టర్ రమేష్ హాస్పటల్ వారు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఖాసీంబాబు, నాగుల్ మీరా, ,కంచర్ల కళ్యాన్, వెంకటప్పరెడ్డి, చిన్న పేనా, నాగులమీరా, అమన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.6 లక్షల సాయం

ప్రజాశక్తి - తెనాలి : పేదరికంలో మగ్గుతూ అరుదైన వ్యాధితో బాధపడుతున్న రోగికి చిత్తశుద్ధితో ప్రభుత్వం నుంచి సాయం అందించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. నియోజకవర్గంలోని తెనాలి మండలం చావా వారిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు కిరణ్ కుమార్ కొంత కాలంగా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధప డుతున్నాడు. వ్యాధికి చికిత్స ఇరు తెలుగు రాష్ట్రాల్లో అందు బాటులో లేని కారణంగా, బాధితుడు బెంగళూరులో చికిత్స పొందాల్సి ఉంది. సంబంధిత శస్త్ర చికిత్సకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయాన్ని వారు మంత్రి మనోహర్ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి సానుకూలంగా స్పందించి రూ.6 లక్షల నిధులను విడుదల చేయడంతో ఆ చెక్కును రోగి కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమ కోరే ప్రభుత్వం కావడంతో వెంటనే స్పందించి బాధితునికి బాసటగా నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిడిసిసి బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్

నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా శ్రీనివాస్, బాలజీ ప్రసాద్

ప్రజాశక్తి - తెనాలి



శ్రీనివాస్, బాలజీ ప్రసాద్

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసి యేషన్ సర్వసభ్య సమా వేశం ఆదివారం స్థానిక బోస్ రోడ్డు లోని జిడిసిసి బ్యాంక్ సెంట్రల్ కార్యాలయ ంలో జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఉద్యోగులకు వేతన సవరణ జరగాలని, ఉద్యోగులు బ్యాంకు నుంచి పొందే అన్ని రుణాలపై నూరు శాతం భీమా సౌకర్యాన్ని కల్పించాలని, మిగిలిన ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో సమానంగా ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62కు పెంచాలని, ఉద్యోగుల బదిలీలు ట్రాన్సర్ పాలసీకి అనుగుణంగా జరగాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. తీర్మానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు కు, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కు అందజేయాలని నిర్ణయించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షునిగా కెవి మహేందర్ రావు, జిల్లా అధ్యక్ష, కార్యదౕర్శులుగా సుంకర శ్రీనివాసన్, కోనేరు బాలాజీ ప్రసాద్, కోశాధికారిగా దొప్పలపూడి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.

పెదనందిపాడులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు అశోకా హైస్కూల్‌లో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 382 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం నర్రాసుబ్బరామయ్య జ్ఞాపకార్థం నర్రా బాలకృష్ణ, ముద్దన రాఘవయ్య సహకారంతో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేతృత్వంలో రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మలినేని పెరుమాళ్ళు. నర్రా మహాలక్ష్మమ్మలు ప్రారంభించారు. ఈ శిబిరంలో 192 మందికి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు క్యాంపు కోఆర్డినేటర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మలినేని లక్ష్మయ్య గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ మలినేని పెరుమాళ్ల మాట్లాడుతు నియోజకవర్గ పరిధిలో రోటరీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిఎస్ఆర్ రావి సత్యనారాయణ, పెదనందిపాడు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ శివప్రసాద, ఎన్ వి ఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యుంగ్ జనరేషన్ టీం వితరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

యంగ్ జనరేషన్ టీం ఆధ్వర్యంలో పట్టణంలో పలువురి పేద కుటుంబాలకు ఆదివారం నిత్యవసరాలు పంపిణీ చేసినట్లు యంగ్ జనరేషన్ టీం అధ్యక్షుడు సాదిక్ తెలిపారు. బియ్యం బస్తాలు, కూరగాయలతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేశామన్నారు. ప్రమాదంలో కాలు, చేయి పోగొట్టుకున్న ఐతానగర్ కు చెందిన అన్నారావు కు ట్రై సైకిల్ అందజేసామన్నారు. సంస్థ ద్వారా అన్నారావు కుటుంబానికి ప్రతినెల నిత్యావసరాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఐదు సంవత్సరాల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన దాసు కుటుంబానికి, తెనాలి పట్టణంలోని మార్కెట్ ఏరియాకి చెందిన హుస్సేన్ జానీ, లింగేశ్వర రావు ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శివ, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కల్లుగీత కార్మికుల హర్షం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు బ్రాందీ షాపుల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు మండలంలోని కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కంచర్ల వెంకటేశ్వరావు ఏమినేని కోటేశ్వరరావు జూపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు మరియు ఆ పార్టీ నాయకులు వల్లూరు నరసింహారావు నూక తోటి రవి వాసిరెడ్డి సుధాకర్ నక్క చిరంజీవి పర్వతౕనేని హర్ష తదితరులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రం కోసం మసీదులో ప్రార్థనలు

ప్రజాశక్తి - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు భారతదేశంలో కూడా నిత్యం సిరి, సంపదలతో ఉండాలని కోరుతూ నిత్యం దైవ భక్తితో లక్షలాదిమంది ప్రార్థనలు చేసే పవిత్రమైన మక్కా , మదీనా మసీదుకు వెళుతున్నానని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం మంగళగిరిలో విలేకరులతో జలీల్ మాట్లాడారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన విధంగా మక్కా లో ఏడు రోజులు, మదీనాలో ఏడు రోజులు, మసీదుకు వెళ్లి ప్రజలందరి తరపున ప్రత్యేక ప్రార్ధన చేసేందుకు వెళుతున్నట్లు జలీల్ తెలిపారు.

పారేళ్ల రత్తయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి సీనియర్ కళాకారుడు పారెళ్ళ రత్తయ్య రెండవ వర్ధంతి సందర్భంగా ఆదివారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సభ జరిగింది. ఈ సభకు ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా రత్తయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. . ఈ సందర్భంగా డాక్టర్ గోలి రామ్మోహన్రావు, మంగళగిరి నియోజకవర్గ సిపిఐ కార్య దర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్య దర్శి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

నేటి నుండి అందుబాటులోకి ఇసుక : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గృహ వినియోగదారులకు సెప్టెంబర్ 30 నుండి ఉచిత ఇసుక అందుబాటులో వుంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సొంత అవసరాల కోసం ఎవరికైనా ఇసుక కావాల్సిన వారు sand.ap.gov.in పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని, నగదు చెల్లించి, దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక ఇవ్వడం జరుగుతుందన్నారు. సొంత వాహనం కలిగిన వారికి ఇసుక స్లాట్ ఇవ్వడం జరుగుతుందని, ఆ స్లాట్‌లోకి వెళ్ళి ఇసుక తెచ్చుకోవాలన్నారు. సొంత వాహనం లేని వారికి ప్రభుత్వం వాహనం సమకూర్చుతుందని, వారు ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు చెల్లించాల్సి వుంటుందన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

ఎపిఎస్‌ఆర్‌టిసి డిపో మేనేజర్ కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్.అబ్దుల్ సలాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-హైదరాబాద్, గుంటూరు-తెనాలి, గుంటూరు- విజయవాడ, గుంటూరు-విశాఖపట్నం రూట్‌లలో తిరుగుతున్న బస్‌ల గురించి, సిబ్బంది పనితీరు గురించి ప్రయాణికులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతో గుండె సురక్షితం

ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

అనారోగ్య జీవన విధానం, వ్యాయామం లేకపోవడం వల్ల ఎక్కువగా ప్రజలు గుండె జబ్బులకు గురవుతున్నారని స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ తెలిపారు. ఆదివారం స్థానిక కారుమూరి హాస్పిటల్‌లో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి సహకారంతో అవగాహన సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 200 మందికి ఉచితంగా హెచ్‌బిఎఎల్‌సి, ఇసిజి, ఎకో, లిపిడ్రోఫైల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతు ప్రతి రోజు వ్యాయామం చేస్తూ, మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ గుండెకు సంబంధించిన సమస్యలు దరిచేరకుండా చూసుకోవాలని కోరారు. డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా గుండెకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని, అందువల్ల ఇలాంటి పరిస్థితి నుండి మానవాళిని కాపాడే ప్రయత్నంలో భాగంగా , వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచన మేరకు గుండెకు సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించటానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామం లేకపోవడం, అనారోగ్య ఆహార అలవాట్లు, దుర్వ్యసనాల వలన గుండెకు సంబంధించిన అనారోగ్యపు సమస్యలు తలెత్తుతున్నాయని, రోజుకి కనీసం 30 నిమిషాల చొప్పున వారానికి ఐదు రోజులు వ్యాయామం చేయాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురిచేసే పరిస్థితులు రాకుండా చూసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, సరిపడ విశ్రాంతి, సరిపడ నిద్ర ఉండేలా చూసుకోవాలన్నారు. సాధారణంగా ఛాతిలో నొప్పి అనిపించినప్పుడు దానిని గ్యాస్ నొప్పి అని భావించి ఆలస్యం చేయకుండా వెంటనే దగ్గరలోని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అన్ని అవయవాలకీ రక్తం సరఫరా అయి సరిగా పనిచేయాలన్నా గుండె పనితీరు బాగుంటేనే సాధ్యమని, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఇంకా అప్రమత్తంగా ఉండాలని వారికి గుండెకు సంబంధించిన సమస్యలు రావడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లలితా హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న డాక్టర్ అనురాగ్

ప్రజల జీవనశైలిలో అనేక అనారోగ్యకరమైన మార్పుల వల్ల గుండెజబ్బుల ప్రమాదకారకాలు పెరిగాయని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, కార్డియాలజిస్ట్, ఎండోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ డాక్టర్ పి.అనురాగ్ తెలిపారు. వరల్డ్ హార్డ్‌డే సందర్భంగా లలితా హాస్పిటల్‌లో అన్ని రకాల హృదయ సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుండె జబ్బుల లక్షణాలు, రిస్క్ ఫ్యాక్టర్స్, నివారణ, చికిత్సల గురించి వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం 17.7 మిలియన్ల మరణాలకు హృదయ సంబంధ వ్యాధులు కారణం అవుతున్నాయన్నారు. ఇందులో ఐదో వంతు మరణాలు యువతలో సంభవిస్తున్నాయని చెప్పారు. మరణాల రేటు ప్రపంచ సగటు ప్రతి లక్ష జనాభాలో 235 కాగా, భారత దేశంలో 272గా ఉందన్నారు. గుండె వ్యాధి ఉందని తెలియకుండానే చాలా మరణాలు అకస్మాత్తుగా జరుగుతున్నాయని అన్నారు. సంవత్సరానికి ఒకసారి హార్ట్‌స్క్రీనింగ్ చేయించుకుంటే ఈ పరిస్థితిని నివారించవచ్చని అనురాగ్ వివరించారు. ఈ సంవత్సరం ప్రపంచ హృదయ దినోత్సవం థీమ్ 'యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్' అని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో సుమారు 300 మందికిపైగా వినియోగించుకున్నారన్నారు. గుండె సంబంధ వ్యాధుల నివారణకు వారానికి ఐదు రోజులు 30 నిముషాల చొప్పున వ్యాయాయం చేయాలని, సమతుల ఆహారం తీసు కోవాలని, ఒత్తిడిని అధిగమించటానికి ధ్యానం చేయాలని, సరైన నిద్ర, విశ్రాంతి ఉండాలన్నారు. ధూమ పానం, మద్యం మానేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫణి, డాక్టర్ మాధురి, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ సంగ్రామ్‌సింగ్, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ సాయి, డాక్టర్ ఇందు, డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం

- ఇసుక కొరత లేకుండా చూస్తాం
- వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ
- సిఆర్‌డిఎ పరిధిలో 23,196 ఇళ్లు మంజూరు
- ప్రజాశక్తితో గృహ నిర్మాణ సంస్థ పీడీ వేణుగోపాల్



ఇంటర్వ్యూ

గుంటూరు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పక్కా గృహ నిర్మాణం పథకం ద్వారా చేపట్టిన ఇళ్ల నిర్మాణం 100 రోజుల్లో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ టి.వేణుగోపాల్ తెలిపారు. ఇసుక సరఫరా లేక ఇటీవల కొద్ది రోజులు నిర్మాణాలు ఆగాయని, తిరిగి ఇసుక సర ఫరాకు ఉన్నతాధికారులు చర్యలు తీసు కుంటు న్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం వివిధ దశలో ఉన్న నిర్మాణాలను వేగిరపరచి మార్చి కల్లా నిర్మా ణంలో ఉన్న ఇళ్లు మొత్తం పూర్తి చేయడానికి చర్య లు తీసుకుంటున్నామని ఆయన వివ రించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

జిల్లాలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి? ఎన్ని ప్రారంభించారు?

గుంటూరు జిల్లాలో 69,490 ఇళ్లు మంజూరు చేశాం. వీటిల్లో ఇప్పటి వరకు 21,358 ఇళ్లు పూర్తయ్యాయి. 39,093 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. రూ.613.04 కోట్లతో నిర్మాణాలు చేపట్టాం. అయితే ప్రస్తుతం నిర్మాణంలో ఇళ్లల్లో కనీసం 100 రోజుల్లోనే పూర్తి చేయించడానికి కూడా లక్ష్యం నిర్ధేశించామన్నారు. దాదాపు 50 శాతం పూర్తి అయిన వాటిని 100 రోజుల్లోనే పూర్తి చేయడానికి లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. తగిన అవగాహరన కల్పిస్తున్నాం.

ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత ఉందా?

ఇటీవల వరదల రావడంతో ఇసుక రీచ్‌ల నుంచి తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఇసుక అందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక కావాల్సిన వారు శ్యాండ్ పోర్టల్‌లో పేర్లు నమోదుచేసుకుంటే సొంత వాహనం ఉన్నవారు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చు. వాహనం లేని వారికి ప్రభుత్వం వాహనం సమకూరుస్తుంది.

ఆప్షన్ ఒకటి, రెండు పద్ధతుల్లో ఎన్ని మంజూరు చేశారు?

ఆప్షన్ ఒకటి, రెండు పద్ధతుల్లో మొత్తం 28,739 ఇళ్లు మంజూరు చేశారు. వీటిల్లో 11,768 పూర్త య్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు రూ.287.38 కోట్లు వరకు ఖర్చు పెట్టాం. గత ప్రభు త్వంలో మంజూరు చేసిన ఇళ్లలకే వివిధ దశలో ఉన్న వాటిని త్వరిత గతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

పేరేచర్ల లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణం ఎలా ఉంది?

పేరేచర్ల లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉంది. ఆప్షన్ -3లో లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. పేరేచర్ల లే అవుట్‌లో మొదటి దశలో 11,123 గృహాలు మంజూరు కాగా 9 వేల ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయింది. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. మార్చి కల్లా పూర్తి చేయాలని ఇటీవల గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్ధసారధి సందర్శించి ఆదేశాలు ఇచ్చి వెళ్లారు.

కొత్తగా మంజూరైన ఇళ్లుఎన్ని?

తాజాగా జిల్లాలో సిఆర్‌డిఏ పరిధిలో 23,196 ఇళ్లు మంజూరు చేశారు. ఇవిగాక కొత్తగా 939 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 8102 ఇళ్లపునాది దశలో ఉన్నాయి.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జెవివి కథల పోటీలకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-గుంటూరు


పోటీలను ప్రారంభిస్తూ మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆదివారం స్థానిక ఏసీ కాలేజి ప్రాంగణంలో నిర్వహించిన కథల పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. వందల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని కథలు రాశారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు ప్రారంభి ంచారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు ఈ కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. సోషల్ మీడియా, బట్టీ చదువుల వల్ల విద్యార్థుల్లో ఆలోచనా శక్తి తగ్గిపోతుందన్నారు. ఇటువంటి పోటీలు వారిలో ఆలోచనలు రేకెత్తించటానికి దోహదం చేస్తాయన్నారు. ఏసీ కాలేజి ప్రిన్సిపాల్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థులను పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించిన తల్లి దండ్రులు, ఉపాధ్యాయులను, అలాగే పోటీలు నిర్వహిస్తున్న జెవివిని అభినందించారు. ప్రజాగాయకుడు పి.వి.రమణ ప్రస్తుత బాల్యం ఆటపాటలకు దూరం అవుతున్న తీరును వివ రిస్తూ గేయాలు ఆలపించాడు. బాల సాహి తీవేత్త హకీమ్‌జానీ, ఎస్ఎం సుభాని, జెవివి నాయకులు ఏఎస్ ప్రసాద్, టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి.వెంకటరావు, బి.శంకర్‌సింగ్, ఇ.రాధ, టి.ఆర్.రమేష్, ఆర్.స్వాతి తదితరులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

పిఆర్‌సి, డిఎ బకాయిలు విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కెఎస్ఎస్ ప్రసాద్

దీర్ఘకాలంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నూతనంగా ఎపిజెఎసి సెక్రెటరీ జనరల్‌గా ఎన్నికైన కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు, పిఎఫ్ సాధన కోసం, పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం నాలుగు దశల్లో పోరాటం చేయబోతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. ఈ ప్రభుత్వ విధానాలను బట్టి జెఎసి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ దసరాకి ఉద్యోగులకు పిఆర్‌సి, డిఎ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఇఒ-1 పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఉపాధ్యాయులపై పెరిగిన యాప్‌ల భారం తగ్గించాలని, దీని ప్రభావం సిలబస్‌పై, బోధనపై పడుతుందన్నారు. కావున యాపులు రద్దు చేయాలని అన్నారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంట్ విడుదల చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండి దౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, యం.గోవిందయ్య, టి.ఆంజనేయులు, యు.రాజశేఖర్, జి.వి.ధనలక్ష్మి, కె.కేదార్నాథ్, ఎ.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.